ఈనాడు
రాజన్న సిరిసిల్ల

మంగళవారం అక్టోబరు 22, 2024

నిలిచిన పైవంతెన పనులు.. తీరని కష్టాలు

న్యూస్‌టుడే, వేములవాడ గ్రామీణం

వర్షాకాలంలో ఏటా వరద ఉద్ధృతితో వాహనాల రాకపోకలు నిలిచిపోతుండటంతో పైవంతెన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో వంతెన నిర్మాణంలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటుంది. సకాలంలో పూర్తి కాకపోవడంతో అత్యవసర సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వేములవాడ గ్రామీణ మండలం హన్మాజీపేటలో వర్షాకాలంలో నక్కవాగు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతుంటాయి. హన్మాజీపేట, బొల్లారం, లింగంపల్లి, కోనరావుపేట మండలం మామిడిపల్లి, బావుసాయిపేట గ్రామాల ప్రజలు నక్కవాగు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షానికి నక్కవాగు ప్రవహించడంతో వాగు దాటేందుకు వీలుపడదు. పైవంతెన నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులకు విజ్ఞప్తి చేయడంతో ప్రభుత్వం వంతెన నిర్మాణం కోసం రూ. 11.55 కోట్లను మంజూరు చేసింది.



మధ్యలో ఆగిపోయిన పనులు

ఇవీ ఇబ్బందులు

- వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనులు సకాలంలో ప్రారంభంకాలేదు. ఏడాది క్రితం పనులు ప్రారంభించినప్పటికీ నేటికీ పిల్లర్ల దశలోనే ఉన్నాయి.
- వాహనాల రాకపోకల కోసం తాత్కాలిక దారిని ఏర్పాటు చేశారు. వర్షాలకు పలుమార్లు కొట్టుకుపోయింది. దీంతో హన్మాజీపేట, బొల్లారం, లింగంపల్లి గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
- వంతెన పూర్తికాకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల హన్మాజీపేట గ్రామానికి చెందిన ఓ మహిళ అస్వస్థతకు గురికాగా 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. 108 వాహనం వాగు దాటడానికి రోడ్డు లేకపోవడంతో సిబ్బంది ఆమెను గ్రామం నుంచి స్ట్రెచర్‌పై వాగు దాటించి ఆసుపత్రికి తీసుకెళ్లగా సకాలంలో వైద్యం అందకపోవడంతో ఆమె ప్రాణాలు విడిచింది.
- ఏడాదిలో వంతెన నిర్మాణం పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

త్వరితగతిన పూర్తి చేయాలి



వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. వర్షాకాలంలో అత్యవసర సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రికి సకాలంలో వెళ్లలేక వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయింది. తాత్కాలిక రహదారి కోతకు గురైంది. అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- రాకేశ్, హన్మాజీపేట

వర్షాలతో ఆలస్యం



వర్షాలు కురవడంతో వంతెన నిర్మాణ పనుల్లో ఆలస్యం జరుగుతుంది. పిల్లర్ల దశకు వంతెన పనులు చేరుకున్నాయి. దీపావళి అనంతరం తిరిగి ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నాం. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించాం. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశాం.

- శాంతయ్య, డీఈ ఆర్ అండ్ బీ

ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర కీలకం

చందుర్తి, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల త్యాగం వల్లే మనమంతా శాంతి, సౌభ్రాతృత్వంతో ఉన్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా చందుర్తి మండలం లింగంపేట శివారులోని పోలీస్ అమరవీరుల స్మారక స్తూపం వద్ద ఎస్పీ అఖిల్ మహాజన్, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణతోపాటు దేశ అంతర్గత భద్రతలు, ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో పోలీస్ వ్యవస్థ కీలకంగా పని చేస్తుందన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ అసాంఘిక శక్తులతో జరిపిన పోరులో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారు అందించిన స్ఫూర్తితో రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన అమరవీరుల కుటుంబ సభ్యులతో కలెక్టర్, ఎస్పీలు మాట్లాడారు. వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ మురళీ కృష్ణ, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



అమరవీరులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, చిత్రంలో ఎస్పీ అఖిల్ మహాజన్

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

వేములవాడ, న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం వేములవాడ పట్టణంలోని బాల్‌నగర్‌లో వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామతీర్థపు మాధవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ రైతును రాజు చేయాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పమని తెలిపారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సాంకేతిక కారణాలతో కొంత మంది రైతుల ఖాతాలో జమ కాలేదని, అలాంటి వారి సమస్యను పరిష్కరించేందుకు వ్యవసాయ, బ్యాంక్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. సన్న రకం వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వనున్నట్లు చెప్పారు. అకాల వర్షాలతో రైతులకు ఇబ్బంది తలెత్తితే తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. టార్పాలిన్లు రైతులకు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బింగి మహేశ్, డైరెక్టర్లు, మార్కెటింగ్, వ్యవసాయశాఖ అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



వేములవాడ కేంద్రంలో తేమశాతం పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, చిత్రంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాధవి తదితరులు

ధరణి సమస్యలు.. గూగుల్ మీట్‌తో పరిష్కారం

కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రత్యేక చొరవ

ఈనాడు, సిరిసిల్ల: కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చే దరఖాస్తుల్లో ధరణి సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. ఇవి పరిష్కారం కాక రైతులు మళ్లీ వస్తున్నారు. దీనికి తక్షణ పరిష్కారం చూపించేందుకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక దృష్టి సారించారు. అర్జీదారు తన సమస్యను వివరించాక.. వాటి పత్రాలను అక్కడి నుంచే సంబంధిత మండల తహసీల్దార్ మెయిల్‌కు పంపుతున్నారు. ఆ పత్రాలను వారు పరిశీలించాక ఆయా మండల తహసీల్దార్, ఇతర సిబ్బందితో గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్నారు. సమస్య ఎలా వచ్చింది? ఇన్ని రోజుల జాప్యానికి కారణాలు? అడిగి తెలుసుకుంటున్నారు. దాని పరిష్కారానికి ఆయా మండలాల రెవెన్యూ సిబ్బందికి నేరుగా ఆదేశాలు జారీ చేస్తున్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం కాని వాటికి అక్కడికక్కడే పరిష్కారం లభిస్తుంది. దీంతో అర్జీదారులు ఊరట చెందుతున్నారు.

పారదర్శకతతో ముందుకెళ్తా!

- విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే నా లక్ష్యం
- శాతవాహన ఉప కులపతి ఉమేశ్‌కుమార్

ఈనాడు, కరీంనగర్

విశ్వవిద్యాలయంలో విద్యా వికాసం.. ఉన్నత విలువల ఆచరణపై దృష్టి పెడతానని ఉపకులపతి ఉమేశ్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆయన 'ఈనాడు'తో ముఖాముఖిలో పలు విషయాలు వెల్లడించారు. అన్ని వ్యవహారాల్లో పారదర్శకతతో ముందుకెళ్తా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడతానని పేర్కొన్నారు. సమస్యల సవాళ్లను తనకున్న అనుభవంతో అధిగమిస్తానని.. ఆహ్లాదకర వాతావరణంలో చదువుకునేలా విద్యార్థులకు వసతులు కల్పిస్తానని చెప్పారు.

మార్పు చూపిస్తా

నా హయాంలో కచ్చితంగా పాలనా వ్యవహారాల్లో మార్పు చూపిస్తా. అన్ని విషయాల్లో పారదర్శకతే నా మంత్రం. అదే పంథాలో ముందుకు వెళ్తా. చిన్నచిన్న సమస్యలు ఎక్కడైనా ఉంటాయి. వాటిని నా స్థాయిలో పరిష్కరిస్తా. పెద్ద సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కారమయ్యే విధంగా చూస్తా. గతంలో ఇక్కడ రిజిస్ట్రార్‌గా పనిచేసిన అనుభవం నాకు ఉపయుక్తంగా మారుతుంది. అప్పటికన్నా ఇప్పుడు వీసీ హోదాలో కొన్నింటి విషయంలో నిర్ణయాధికారం ఉండటంతో మెరుగైన చర్యలు తీసుకోగలను.

బాధ్యులపై చర్యలు తప్పవు

విశ్వవిద్యాలయం పరిధిలో గతంలో జరిగిన అక్రమాలు, అధికార దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. నా వంతు సహకారం అందిస్తా. అదే సమయంలో నా దృష్టికి వచ్చిన ఏ విషయాన్నీ విస్మరించను. అక్రమ నియామకాలు, దొడ్డిదారిన పదోన్నతులు.. ఇలా విద్యా వ్యవస్థను అప్రతిష్ఠపాలు చేసిన ప్రతి విషయంపై సమగ్రంగా విచారణ జరుగుతుంది. తప్పకుండా బాధ్యులపై చర్యలుంటాయి.

న్యాక్ గుర్తింపునకు నా మొదటి ప్రాధాన్యం


నా మొదటి ప్రాధాన్యం శాతవాహనకు న్యాక్ గుర్తింపు తేవడం. ఇందుకోసం అవసరమైన ప్రణాళికతో ముందడుగు వేస్తా. గుర్తింపు సాధిస్తే నిధులు సమృద్ధిగా వస్తాయి. విద్యాపరంగా సమూలమైన మార్పులకు అవకాశం ఉంటుంది. 200 ఎకరాల భూమి అందుబాటులో ఉండటంతో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నది నా రెండో ప్రాధాన్యత. తరువాత బీఈడీ, ఎంఈడీ కళాశాలల ఏర్పాటు సహా పీహెచ్‌డీకి అవకాశాన్ని కల్పిస్తాం. దీర్ఘకాలికంగా ఇక్కడ ఉన్న ప్రధాన సమస్యలు జిల్లాకు చెందిన మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా చొరవ చూపిస్తా. మౌలిక వసతుల కల్పన పరంగా మంచి మార్పులు తీసుకొస్తా. ఈ విశ్వవిద్యాలయాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెట్టే విధంగా నా శాయశక్తులా కృషి చేస్తా. మూడేళ్లలో ఇదొక మంచి గురుకులమనే భావనను విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో కల్పిస్తా.

కొత్త కోర్సులు.. పోస్టులు..

జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ-2020) ప్రకారం ఉన్నత విద్యలో ఎన్నో మార్పులొస్తున్నాయి. పోటీ ప్రపంచంలో విద్యార్థికి బహుళ ప్రయోజనంతో కూడిన విద్యను అందించే వ్యవస్థను ఇక్కడ ఏర్పాటు చేస్తాం. ఇష్టానుసారంగా వేరే కోర్సుల్లోకి మారే వెసులుబాటుతోపాటు ఎన్నో అవకాశాలు కొత్త విద్యా విధానంలో ఉండనున్నాయి. ఇక్కడ ప్రస్తుతం నడుస్తున్న సంప్రదాయ కోర్సుల స్థానంలో డిమాండ్ ఉన్న కొత్త కోర్సులను ప్రవేశపెడతాం. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల ఆవశ్యకతను గుర్తిస్తాం. బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలు అధికంగా ఉన్నాయి. వీటి భర్తీ కోసం ప్రభుత్వానికి విన్నవిస్తా. కొత్త పోస్టులను కూడా మంజూరు చేయిస్తా. గతంలో నేను రిజిస్ట్రార్‌గా ఉన్నప్పుడు ఒకసారి స్నాతకోత్సవం జరిగింది. త్వరలో మరోసారి నిర్వహిస్తాం.

విద్యార్థుల బాధలు తెలిసిన వ్యక్తిని..

మధ్యతరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన నాకు పేద విద్యార్థుల బాధలు తెలుసు. దీపం వెలుతురులో చదువుకుని ఈ స్థాయికి వచ్చాను. నేను విద్యార్థుల పక్షపాతిని. రీసెర్చ్ స్కాలర్‌గా విద్యార్థి సంఘ నాయకుడిగానూ పని చేశాను. విద్యార్థులు వచ్చి నాకు సమస్యలు విన్నవించే కన్నా.. నేనే వారి వద్దకు నిత్యం వెళ్తా. ఆకస్మిక తనిఖీలు చేస్తా.



బాధ్యతల స్వీకరణ

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్యులు ఉమేశ్‌కుమార్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మొదట ఆయనకు బోధన, బోధనేతర సిబ్బంది స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమం నిర్వహించిన తదుపరి బాధ్యతలు స్వీకరించారు. వీసీకి పలు ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, వివిధ సంఘాల నేతలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉపకులపతిని కలిసిన వారిలో ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, బీసీ సంఘాల నేత శ్రీధర్ తదితరులు ఉన్నారు.

అర్జీదారుల ఆపసోపాలు



నేలపై దరఖాస్తులు నింపుతున్న దృశ్యం

కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి వచ్చే అర్జీదారులకు ఆపసోపాలు తప్పడం లేదు. తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రతి సోమవారం వందల సంఖ్యలో వస్తుంటారు. కలెక్టరేట్‌లో స్టేషనరీ దుకాణం, జిరాక్స్ కేంద్రం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అన్ని పత్రాలు ఉన్నా దరఖాస్తు రాసేందుకు నిరక్షరాస్యులు దిక్కులు చూడాల్సిన పరిస్థితి. దీనికోసం ప్రజావాణి నాడు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గతంలో నేరుగా దరఖాస్తుతో కలెక్టర్ దగ్గరికి వెళ్లేవారు. ఇప్పుడంతా ఆన్‌లైన్ చేశారు. తొలుత ప్రజాపాలన కేంద్రంలో ఆన్‌లైన్ చేసుకోవాలి. వీరి సమస్య ఆధారంగా సంబంధిత శాఖను తెలుపుతూ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, దాని కాపీని బాధితుడికి అందజేస్తారు. దీనిని దరఖాస్తుకు జత చేసి కలెక్టర్‌ను కలవాలి. వారి సమస్య విన్నాక దానిని సంబంధితశాఖ ఉన్నతాధికారికి పంపుతారు. ఇలా అందిన వాటిని శాఖల వారీగా పర్యవేక్షణ ఉంటుంది. పరిష్కారం కాని వాటికి సమాధానం ఆయా శాఖల అధికారులు కలెక్టర్‌కు వివరించాలి. **-ఈనాడు, సిరిసిల్ల**


అల్లుకున్న నిర్లక్ష్యం



సిరిసిల్ల పట్టణంలోని అశోక్‌నగర్‌లో వివేకానంద విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాల సమీపంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న పిచ్చిమొక్క పెరిగి విద్యుత్తు స్తంభం చివరి వరకు పాకింది. వర్షాలు పడే సమయంలో తీగకు తగిలి విద్యుత్తు సరఫరా అయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, పాదచారులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి దానిని తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సిరిసిల్ల అర్బన్**

ఆర్టీసీ బస్టాండ్‌లో ఊడుతున్న పెచ్చులు

వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో స్లాబ్ పెచ్చులు ఊడిపోతుండటంతో ప్రయాణికుల్లో ఆందోళన నెలకొంది. గతంలో బస్టాండ్ స్లాబ్‌కు మరమ్మతులు చేశారు. మళ్లీ అవే ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఊడిపోతున్నాయి. దీన్ని బట్టి పనుల్లో ఎంత నాణ్యత ఉందో స్పష్టమవుతుంది. పెచ్చులు ఊడిపోయిన బస్టాండ్ స్లాబ్ కింద కూర్చోవడానికి ప్రయాణికులు భయపడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బాగు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వేములవాడ**



హర హర మహాదేవ... శంభోశంకర



ఆలయం ప్రాంగణంలో భక్తులు

వేములవాడ, న్యూస్‌టుడే: దక్షిణ కాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ధర్మగుండం రద్దీగా మారాయి. ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పరివార దేవతలను దర్శించుకున్నారు. రద్దీ కారణంగా ఆర్జిత సేవలు నిలిపివేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షణ చేశారు. దాదాపు 45 వేల మంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

రైతేరాజు 6లో

వినతులు అందించాం.. సమస్యలు పరిష్కరించండి

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలంటూ జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు అర్జీదారులు తరలివచ్చి జిల్లా యంత్రాంగానికి వినతిపత్రాలు అందజేశారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశమందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఆర్డీవో శేషాద్రిలు ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 149 వచ్చాయి. వాటిని సంబంధిత అధికారులకు అందజేసి జాప్యం చేయకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రజావాణిలో 149 దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వలేదు



మా గ్రామ శివారులో సర్వే నంబరు 379లో నాకు రెండు ఎకరాల 5 గుంటల భూమి ఉంది. ఇందులో 75 గుంటల భూమిని అవసరం నిమిత్తం విక్రయించాను. మిగిలిన 10 గుంటల భూమికి సంబంధించిన వివరాలు పట్టాదారు పాసుపుస్తకంలో సరిగా ముద్రించబడలేదని, తప్పులను సరిచేసి ఇస్తామని నాలుగు సంవత్సరాల కిందట కోనరావుపేట తహసీల్దారు తీసుకున్నారు. ఇప్పటి వరకు ఇవ్వలేదు. నాకు పాసుపుస్తకం ఇప్పించి న్యాయం చేయండి.

- ఉప్పల అంజయ్య, సుద్దాల, కోనరావుపేట మండలం

ఇల్లు మంజూరు చేయరూ!



నాకు సొంత ఇల్లు లేదు. గత 25 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం. నాకు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయాలి.


- ఆరె పద్మ, ఇందిరానగర్, సిరిసిల్ల

వితంతు పింఛను ఇవ్వాలి



నా భర్త బోడపట్ల కొమురయ్య 2022 నవంబరు 21న గుండెపోటుతో మరణించాడు. గతంలో నా భర్తకు పింఛను వచ్చేది. నాకు వితంతు పింఛను ఇప్పించాలి. **- బోడపట్ల ఎల్లవ్వ, తంగళ్లపల్లి**

స్థానిక రేషన్ దుకాణానికి మార్చండి



మా కాలనీలో సుమారు 100 వరకు అంత్యోదయ కార్డులు ఉన్నాయి. వీరిలో చాలా మంది వృద్ధులు, దివ్యాంగులు ఉన్నారు. ప్రతి నెలా సిరిసిల్ల పట్టణానికి వెళ్లి రేషన్ తీసుకుంటున్నాం. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా రేషన్ కార్డులను కేసీఆర్‌నగర్‌లో ఉన్న రేషన్‌షాపు నంబరు 3909029కు బదిలీ చేసి మాకు రేషన్ ఇప్పించాలి.

- చిమ్మని రాజనర్సయ్య, కేసీఆర్‌నగర్, తంగళ్లపల్లి

ఆవ సాగు.. ఇదే అదను



ఆవ పైరు

రైతేరాజు

జగిత్యాల సహా ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆవ పంట సాగు విస్తీర్ణం పెరుగుతోంది. తక్కువ నీటి వసతి ప్రాంతాల్లో, అడవి పందులు, కోతుల బెడదను తప్పించుకోవడానికి చాలామంది రైతులు యాసంగి పంటగా ఆవపైరును పండిస్తున్నారు. ఆవాల పంటలో మేలైన యాజమాన్యం గురించి **పొలాస పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఇ.రజనీకాంత్** వివరించారు.

■ ఆవపంటను అక్టోబరు నుంచి నవంబరు 25వ తేదీ వరకు విత్తుకోవచ్చు. స్థానిక, సంకర రకాలతో పాటుగా కొన్ని కంపెనీల ద్వారా ఒప్పందంతో రైతులు ఆవాలు సాగు చేస్తున్నారు. నల్లరేగడి నేలల్లో ఎక్కువగా ఆవాలను పండిస్తుండగా రకాలను బట్టి 80-110 రోజుల కాలపరిమితి ఉంటుంది. విత్తిన నెల రోజుల తరువాత 35 కిలోల యూరియాను పైపాటుగా వేయాలి. విత్తిన నెల రోజులవరకు తోటలో కలుపు లేకుండా చూడాలి. నల్లనేలల్లో 3-4 నీటితడులు, తేలిక నేలల్లో పండించిన పంటకు 4-5 నీటితడులు అవసరముంటాయి. పైరు మొలిచిన తరువాత 20-25 రోజులకు మొదటి తడినిచ్చి కొమ్మలు వేసే సమయంలో, పూత సమయంలో, గింజలు పోసుకునే దశల్లో తప్పనిసరిగా నీటి తడులను పారించాలి.

■ డైమండ్ బ్లాక్‌మాత్ లద్దె పురుగులు ఆకుల అడుగున చేరి గీరితింటాయి. ఉద్ధృతి ఎక్కువున్నప్పుడు కొమ్మలను, పూత, పిందెలను కూడా తింటాయి. నివారణకు క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రాము మందును లీటరు నీటికి వంతున కలిపి 10-15 రోజుల వ్యవధిలో రెండుమూడు దఫాలుగా పిచికారీ చేయాలి.

■ ఆవాలను ఆలస్యంగా విత్తినప్పుడు పేనుబంక తీవ్రత పెరుగుతుంది. ఈ పురుగు నివారణకు మిథైల్ డెమటాన్ 2 మి.లీ. లేదా డైమిథోయేట్ 1.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రాము మందును ఒక లీటరు నీటికి వంతున కలిపి పిచికారీ చేయాలి. అవసరమైతే 10-15 రోజుల వ్యవధిలో మరోసారి మందుద్రావణాన్ని పిచికారీ చేయాలి.

■ డౌనీమిల్‌డ్యూ తెగులు సోకిన మొక్కల ఆకులు, కాండం, పుష్పగుచ్ఛాలు, కాయల మీద తెల్లటి ఉబ్బెత్తు పొక్కులు కనిపిస్తాయి. డౌనీమిల్‌డ్యూతో పాటుగా ఆల్టర్‌నేరియా ఆకుమచ్చ నివారణకు 2.5 గ్రాముల డైథేన్ఎం-45 లేదా 2.5 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి వంతున కలిపి పైరుపై పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

■ మంచు ఎక్కువగా ఉంటే బూజు తెగులు ఆశిస్తుంది. ఆకులపై తెల్లటి బూజు వంటి పదార్థం కనిపిస్తే వెట్టబుల్ సల్ఫర్ 3 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా కేరాథేన్ 2.5-3 గ్రాముల మందును ఒక లీటరు నీటికి వంతున కలిపి వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

- న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

రైతు ప్రశ్న - శాస్త్రవేత్త సమాధానం

పంటల సాగులో కర్షకుల సందేహాలను అగ్రానమీ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ పి.మధుకర్‌రావు నివృత్తి చేశారు.

? కాలీఫ్లవర్‌లో గోధుమ రంగు మచ్చలు వస్తున్నాయి.
- మల్లన్న, తిమ్మాపూర్

✓ బోరాన్ దాతు లోపం కారణం. లీటరు నీటికి ట్రైసోడియం ఆక్టా బోరేట్ మందు 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

? పసుపులో దుంప కుళ్లు వ్యాపిస్తోంది. నివారణకు ఏం చేయాలి.
- తిరుపతిరెడ్డి, మద్రివానిపల్లి

✓ **సమాధానం:** దుంప కుళ్లును గుర్తించిన వెంటనే నివారణకు 3 గ్రాముల రిడోమిల్ ఎంజెడ్‌ను లీటరు నీటిలో కలిపి దుంపలు తడిచేలా మొక్కల చుట్టూ తడపాలి.

? చిక్కుడులో పేనుబంక నివారణకు ఏం చేయాలి. - కరుణాకర్, కరీంనగర్

✓ ఫిప్రోనిల్ మందు 2 మి.లీ.ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

– న్యూస్‌టుడే, జమ్మికుంట

నారుమడి యాజమాన్యంతోనే మొక్కల ఎదుగుదల

మీకు తెలుసా?

ప్రస్తుత యాసంగిలో కూరగాయల సాగుకు ఇది అనువైన సమయం కాగా నారుమడిలో చేపట్టే యాజమాన్యంతోనే నారు సరిగా ఎదిగి నాటిన తరువాత మంచి కాపు వస్తుంది. టమాట, వంగ, మిరప, ఉల్లి, క్యాబేజీ, కాలీఫ్లవర్ తదితరాల్లో విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్లు, రసం పీల్చు పురుగు నివారణకు ఆర్థోఫాస్ఫేట్, ఇమిడాక్లోప్రిడ్ వంటివాటితో విత్తనశుద్ధి చేయాలి. వడలు తెగులు నివారణకు ట్రైకోడెర్మా విరిడి పట్టించాలి. ఎత్తయిన నారుమడిని తయారు చేసుకుని వరుసల్లో విత్తనాలను విత్తుకోవాలి. విత్తనాలు మొలకెత్తే వరకు రోజ్‌క్యాన్‌తో నీటిని చల్లాలి. నారుమడిలో కలుపు లేకుండా చూడాలి, నారు మొలకెత్తిన 15 రోజులకు ఫ్యురడాన్ 3జి గుళికలను చల్లాలి. రసం పీల్చు పురుగు, తెగుళ్ల నివారణకు డైమిథేయేట్, మాంకోజెబ్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. ఆరోగ్యవంతంగా ఎదిగిన నారును సాయంత్రం పూట ప్రధాన పొలంలో నాటుకొని నీటి తడి పారించాలి.

– న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

లాభాల మిరప

న్యూస్‌టుడే, గంగాధర



ఇటీవల భారీ వర్షాలు కూరగాయల సాగు రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో గంగాధర మండలం లింగంపల్లికి చెందిన పోల్సాని కిరణ్‌రావు కేవలం 25 గుంటల్లో మిరప పంట సాగు చేసి లాభాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

25 గుంటలు.. రూ.60 వేల పెట్టుబడి..

కోతుల బెడద లేని మిరప సాగు ఎంచుకొన్న కిరణ్‌రావు.. 25 గుంటల్లో సాగు చేపట్టారు. డెక్కన్-887, జెర్సీ-56 రకం విత్తనాలకు రూ.5 వేలు వెచ్చించారు. దున్నకానికి రూ.4 వేలు, పురుగు మందుల పిచికారీకి రూ.15 వేలు, మల్చింగ్‌కు రూ.10 వేలు, కోడి ఎరువులకు రూ.8 వేలు, అడుగు మందులకు రూ.6 వేలు, కర్రలు పాతడానికి కూలీలకు రూ.6 వేలు, ఇతర ఖర్చులు రూ.5 వేలు కలిపి రూ.60 వేల పెట్టుబడి పెట్టారు. రెండు నెలలకు మిరప కాత మొదలవగా ఇప్పటికే 60 క్వింటాళ్ల మిరపకాయలను కరీంనగర్ మార్కెట్‌లో విక్రయించారు. కిలోకు రూ.20 చొప్పున రూ.1.20 లక్షల ఆదాయం సమకూరింది. పెట్టుబడులుపోను రూ.60 వేల లాభం వచ్చింది. ఇంకా మూడు నెలల్లో దాదాపు 80 క్వింటాళ్ల దిగుబడి రానుంది. మరో 30 గుంటల్లో మిరప సాగుకు దుక్కి సిద్ధం చేశారు. వరి, మొక్కజొన్న, ఇతర పంటలు సాగు చేస్తే పెట్టుబడులు కూడా గిట్టుబాటు కాలేదని రైతు తెలిపారు. మల్చింగ్, కర్రలు పాతి మిరప చెట్ల కొమ్మలు నేలకు తాకకుండా చర్యలు తీసుకోవడంతో కాత బాగా వచ్చిందని చెప్పారు.

పోషకాలు.. ఆరోగ్యానికి బాటలు


నేడు జాతీయ గింజల దినోత్సవం

న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం

ఆరోగ్యకర జీవన విధానంపై ప్రజల్లో రోజురోజుకు ఆసక్తి పెరుగుతోంది. ప్రచార మాధ్యమాలు, వైద్య నిపుణుల సలహా మేరకు ఆహార పద్ధతుల్లో మార్పులు చేసుకుంటున్నారు. నిత్యం భుజించే పదార్థాలకు భిన్నంగా ఆలోచిస్తున్నారు. రోగ నిరోధక శక్తిని పెంపొందించుకుంటున్నారు. రోగాలతో మందులకు వెచ్చించే సగం డబ్బుతో అవి రాకుండా ముందుస్తు జాగ్రత్తలు పాటిస్తున్నారు. కార్బోహైడ్రేట్లకు బదులుగా పోషకాహారంపై దృష్టి సారిస్తున్నారు. కరోనా తర్వాత అధిక మంది గింజలు తింటూ ఆరోగ్యాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. నేడు జాతీయ గింజల దినోత్సవం సందర్భంగా వాటి వినియోగం ఉమ్మడి జిల్లాలో ఎలా పెరిగింది. వాటితో ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో వివరిస్తూ 'న్యూస్‌టుడే' కథనం.

పెరిగిన వినియోగం..

కరోనా తర్వాత ఉమ్మడి జిల్లాలో గింజల వినియోగం పెరిగింది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు వీటిని తింటున్నారు. కాస్తో ఖర్చు ఎక్కువ కావడంతో సగం మంది మాత్రమే వీటిని తీసుకుంటున్నారు. సామాన్య కుటుంబాలు మాత్రం పేదోడి గింజగా పేరొందిన వేరుశనగను తింటున్నారు. 20 ఏళ్ల కిందట కరీంనగర్ టవర్ సర్కిల్‌లో గింజల దుకాణాలు ఒకటి, రెండు మాత్రమే ఉండేవి. ఇప్పుడు నగరంలో చాలా ప్రాంతాల్లో దుకాణాలు వెలిశాయి. కరీంనగర్, పెద్దపల్లి, గోదావరిఖని, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రాల్లో దుకాణాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఒకప్పుడు జనాభాలో 5 శాతం మంది మాత్రమే వీటిని తినేవారు. ప్రస్తుతం 40 శాతం మంది ఏదో ఒకటి, రెండు రకాలు కొనుక్కొని వెళ్తున్నారని వ్యాపారి రమేష్ తెలిపారు.



విటమిన్లు.. ఖనిజాలు..


■ గింజలు బాదం, వాల్‌నట్స్, జీడిపప్పు, పిస్తా, పొద్దుతిరుగుడు ఇలా అనేక రకాల్లో లభిస్తున్నాయి. వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు(మాంసకృత్తులు), ఫైబర్(పీచు), విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ప్రస్తుతం చాలామంది అల్పాహారంలో భాగంగా వీటిని తీసుకుంటున్నారు. రాత్రిపూట తీసుకుంటే జీర్ణ సంబంధ సమస్యలు వస్తాయి.



- సాయిప్రియ, పోషకాహార నిపుణురాలు



■ బరువు తగ్గాలనుకునేవారు ప్రతి రోజు గుప్పెడు గింజలు ఆహారంలో భాగం చేసుకోవాలి.



■ **వాల్‌నట్స్ :** మెదడు ఆరోగ్యానికి దోహదపడతాయి. వీటిలోని కాల్షియం, మెగ్నీషియం వంటివి ఎముకల ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఆర్థరైటిస్ వంటి వ్యాధుల బారిన పడకుండా రక్షిస్తాయి.



■ **జీడిపప్పు:** గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వు ఇందులో ఉంటుంది. అల్పాహారంలో భాగంగా తీసుకుంటే మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. గుండె జబ్బులు నియంత్రణలో ఉంటాయి.

గుమ్మడిగింజలు: శరీరానికి ప్రొటీన్ మెగ్నీషియం, ట్రిప్టోఫాన్‌లు అధికంగా లభిస్తాయి.



■ **పొద్దుతిరుగుడు విత్తనాలు:** కంటిచూపు మెరుగుపరచడంతో పాటు శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరగకుండా చూస్తాయి.


■ **బాదం:** విటమిన్స్‌తోపాటు కొవ్వు, ప్రొటీన్ అధికంగా లభిస్తాయి. శరీరాన్ని దృఢంగా ఉంచడంలో సహాయపడతాయి.

■ **పిస్తా పప్పులు:** వీటితో శరీరానికి అధిక ప్రొటీన్ లభిస్తుంది. కంటి చూపు మెరుగుపర్చడంలో మేలు చేస్తుంది.



■ **వేరుశనగలు(పల్లీలు):** కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్, అధిక రక్తపోటు వంటి సమస్యల నుంచి బయటపడటానికి సహాయపడతాయి.

ఖర్చు కంటే ఆరోగ్యం ముఖ్యం..



బయట ఏ ఆహారం తీసుకున్నా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. నాణ్యత, శుచి, శుభ్రత పాటించడం తగ్గిపోయింది. కరోనా తర్వాత ప్రతి రోజు కొన్ని గింజలు, ఎండుఫలాలను తీసుకుంటున్నా. ఖర్చు కంటే ఆరోగ్యం ముఖ్యమని భావించి వీటిని తీసుకుంటున్నా. మధ్యాహ్నం కొద్దిగా అన్నం తింటున్నా. **- రాజన్న, నీటి పారుదల శాఖ ఉద్యోగి**

మా పిల్లల స్నాక్స్ బాక్స్‌లో..



మా ఇద్దరు పిల్లలు బడికి స్నాక్స్ తీసుకెళ్తుంటారు. అందులో బయటి తినుబండారాలు పెట్టను. పండ్లు పెడదామన్నా.. మధ్యాహ్నం వరకు వాడిపోతున్నాయి. అందుకనే బాదం, కాజులాంటివి పెట్టి పంపిస్తున్నాం. కొన్ని సార్లు బాదం, కాజు, ఎండుద్రాక్ష, కర్జూరాలతో లడ్డూగా చేసి ఇస్తున్నాం. ఒక్కోసారి పల్లీ పట్టీలు చేస్తున్నా. బాదం నానబెట్టి తినిపిస్తుంటాం. **- రంగ అనూష, గృహిణి, కరీంనగర్**

ఎస్సారెస్పీకి భారీగా వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: గోదావరి పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి 67,562 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 17 స్పిల్‌వే గేట్లద్వారా 52,108 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువకు 5,800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్లద్వారా 2,200, లక్ష్మీ కాలువకు 150, వరద కాలువకు 5 వేలు, సరస్వతి కాలువకు 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీటినిల్వ, 1091.0 అడుగుల నీటిమట్టాన్ని కొనసాగిస్తున్నారు.

పెరిగిన పత్తి విక్రయాలు

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు క్రమేణా పెరుగుతున్నాయి. సోమవారం యార్డుకు 251 ట్రాలీల విడిపత్తి విక్రయానికి రావటం విశేషం. ప్రస్తుత సీజన్‌లో మార్కెట్‌కు అధికంగా వచ్చిన పత్తి ఇదే. బిడ్డింగ్‌లో క్వింటాకు కనిష్ఠంగా రూ.6,000 గరిష్ఠంగా రూ.7,000 ధర పలికింది. 25 క్వింటాళ్ల బస్తాల పత్తిని రూ.6,400 నుంచి రూ.6,500 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు. మార్కెట్‌లో శుక్రవారం పలికిన ధరే సోమవారం పలికింది. బిడ్డింగ్‌ను మార్కెట్ కార్యదర్శి రాజా పరిశీలించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలను త్వరలోనే ప్రారంభించే అవకాశం ఉందని ఆయన చెప్పారు. దీపావళి సమీపిస్తుండటంతో అధిక పత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. ధర నిలకడగా పలుకుతున్న పత్తిని అధిక తేమతో రైతులు విక్రయానికి తీసుకొస్తున్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. స్థానిక సీసీఐ సిబ్బంది ఒకరు మార్కెట్ యార్డులో పత్తి నాణ్యతను పరిశీలించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ దందా

న్యూస్‌టుడే, రామడుగు

రామడుగు మండలం వన్నారం వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా దందా కాసులు కురిపిస్తోంది. నిత్యం 50 ట్రాక్టర్లతో సుమారు 200 ట్రిప్పులు అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పు ఇసుకకు రూ.2 వేల నుంచి రూ.3 వేలు వసూలు చేస్తున్నారు. పగలు బహిరంగంగా తరలిస్తే రైతులు వ్యతిరేకిస్తారని, చీకటి పడగానే ట్రాక్టర్లను వాగులోకి తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా రామడుగు మండలం సరిహద్దు గ్రామమైన వన్నారం నుంచి బైపాస్ దారి కొత్తపల్లి, కరీంనగర్‌కు తీసుకెళ్లేందుకు అవకాశంగా మారింది. సంబంధిత అధికారులకు మామూళ్లు ముట్టజెప్పడంతో అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోందని సమాచారం. గతంలో సర్పంచి ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలని పంచాయతీ కార్యాలయంలో తాళం వేసుకొని నిరసన తెలిపారు. కానీ ఇసుక అక్రమ రవాణాను అధికారులు అరికట్టలేదు. నిత్యం రూ.4 లక్షల విలువైన ఇసుక అక్రమ దందా కొనసాగుతోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ గ్రామంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం లభించేదని తెలిపారు.



వన్నారం వాగులో ఇసుక ట్రాక్టర్ల గుర్తులు

అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

కరీంనగర్ న్యాయవార్తలు, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ సోమవారం కరీంనగర్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి(పోక్సో కోర్టు) డి.వెంకటేశ్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. రామడుగు మండలంలోని ఒక గ్రామానికి చెందిన ఇంటర్ చదివే బాలిక బంధువులు బోయినపల్లి మండంలోని ఒక గ్రామంలో ఉండటంతో తరచూ అక్కడికి వెళ్లేది. అదే గ్రామానికి చెందిన సంపంగి ప్రేమ్‌కుమార్ అనే యువకుడు బాలికతో పరిచయం పెంచుకొని ఫోన్లో మాట్లాడేవాడు. 2022 ఫిబ్రవరి 21న బాలికను తన గ్రామానికి రమ్మని లేకుంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో అతని వద్దకు వెళ్లింది. ఆమెను వరంగల్ జిల్లాకు తీసుకెళ్లి పెళ్లి చేసుకొని, బలవంతంగా అత్యాచారం చేశాడు. అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్లి, అక్కడి నుంచి కరీంనగర్ తీసుకొచ్చి బస్టాండ్‌లో వదిలివెళ్లాడు. ఆమె తల్లిదండ్రుల వద్దకు చేరుకొని జరిగిన విషయాన్ని చెప్పింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు రామడుగు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితున్ని అరెస్ట్ చేసి.. దర్యాప్తు అనంతరం చొప్పదండి సీఐ రవీందర్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శరత్ వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి డి.వెంకటేష్ ప్రేమ్‌కుమార్‌కు జైలు శిక్ష విధించారు.



కదంబాపూర్: దామెర చెరువులో వలస పక్షులు

వలస పక్షుల కనువిందు

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కదంబాపూర్ శివారులోని దామెర చెరువులో ఎర్రకాళ్ల కొంగలుగా పిలువబడే 'పెయింటెడ్ స్టార్క్స్' కనువిందు చేస్తున్నాయి. పొడవైన ముక్కు, గులాబీ రంగు కాళ్లు, రంగురంగుల రెక్కలు కలిగి ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. చిన్న కప్పల్ని, చేపల్ని ఆహారంగా తీసుకునే వీటి జీవిత కాలం 28 సంవత్సరాలు. కొంగజాతికి చెందిన ఈ వలస పక్షులు.. సాధారణంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని కొల్లేరు, నేలపట్టు సరస్సుల్లో దర్శనమిస్తాయి. తెలంగాణలోని కొన్ని ప్రాంతాల చెరువులు, కుంటల్లో అక్టోబర్ నుంచి జూన్ వరకు ఇవి కనిపిస్తుంటాయి. ఈ పక్షులు చెరువు, కుంటల సమీపంలో ఉండే చెట్లపై గూళ్లు కట్టుకొని గుడ్లు పెట్టి తమ సంతానోత్పత్తిని పెంపొందించుకొని పిల్లలతో సహా వలస వెళ్తుంటాయని జగిత్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.సంగీతారాణి తెలిపారు.

- ఈనాడు, కరీంనగర్, న్యూస్‌టుడే, సుల్తానాబాద్

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు నరేందర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సిరిసిల్లలోని గీతానగర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో షీ టీం అధికారులు మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని కొంత మంది బాలికలు షీ టీం సిబ్బంది వద్దకు వచ్చి ఉపాధ్యాయుడు నరేందర్ కొద్ది రోజులుగా విద్యార్థినుల పట్ల బ్యాడ్ టచ్ చేస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

పది రోజులే గడువు

ఉమ్మడి జిల్లాలో 71 శాతమే సీఎంఆర్ సేకరణ

ఈనాడు, సిరిసిల్ల

ప్రభుత్వం సీఎంఆర్ సేకరణలో జాప్యం వీడటం లేదు. మర ఆడించిన బియ్యం నింపేందుకు గన్నీ సంచుల కొరత, గోదాంల్లో స్థలాభావం తదితర కారణాలతో లక్ష్యం చేరుకోవడంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉమ్మడి జిల్లాలో 2023-24 ఖరీఫ్ సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) సేకరణ లక్ష్యం 71 శాతం చేరుకుంది. ఈ నెల 31తో గడువు ముగుస్తుంది. ఇప్పటికే ప్రభుత్వం పలుమార్లు పొడిగిస్తూ వచ్చింది. పది రోజులే సమయం ఉండటంతో శతశాతం పూర్తి చేయడంపై సందిగ్ధం నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో 2023-24 ఖరీఫ్ సీజన్‌కు పౌరసరఫరాలశాఖ వివిధ కేంద్రాల ద్వారా 30.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. నాలుగు జిల్లాల పరిధిలోని మిల్లులు 20.33 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సీఎంఆర్‌గా ఇవ్వాలి. ఇప్పటి వరకు 15.05 లక్షల మెట్రిక్ టన్నులు ఇచ్చారు. ప్రతి సీజన్‌లోనూ మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు.

■ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి ఇచ్చే క్రమంలో నాణ్యత పేరుతో కోత విధించడం, నిల్వ చేద్దామంటే గోదాంల్లో స్థలాభావం ఇవన్నింటికీ తోడు రవాణా ఛార్జీలు భారంగా మారుతున్నాయి.

■ ఖరీఫ్ సీజన్‌కు ఇంకా 29 శాతం బియ్యం సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాలో 2023-24 వానాకాలం ధాన్యం సేకరణ (లక్షల మెట్రిక్ టన్నుల్లో)

	పెద్దపల్లి	జగిత్యాల	కరీంనగర్	రాజన్నసిరిసిల్ల
సేకరించింది	1.92	3.10	23.24	2.07
ఇవ్వాల్సింది	1.29	2.07	15.62	1.35
అందజేసింది	0.88	1.35	12.23	1.05



మిల్లులో బియ్యం నిల్వలు

■ 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి 50శాతం పైనే సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. కాగా దీనికి గడువు ఉండటంతో ప్రస్తుతం మిల్లర్లు గత ఖరీఫ్ సీజన్‌పై దృష్టి సారించారు.

గడువులోపు పూర్తిచేస్తాం

జిల్లాలో బియ్యం సేకరణ లక్ష్యాలను గడువు లోపు పూర్తి చేస్తాం. ప్రత్యేక అధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి మిల్లుల వారీగా నిత్యం పర్యవేక్షిస్తున్నాం. మిల్లర్లు అన్ని సమస్యలను అధిగమించి సేకరణ లక్ష్యం శతశాతం చేరుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

-భీమ్యానాయక్, అదనపు కలెక్టర్, రాజన్న సిరిసిల్ల

జరిమానా

ప్రభుత్వానికి రెండు, మూడు సీజన్‌లుగా సీఎంఆర్ అప్పగించడంలో జాప్యం చేస్తున్న మిల్లర్లను పౌరసరఫరాలశాఖ డిఫాల్టర్లగా గుర్తించింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పది మిల్లులు ఉన్నాయి. జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లోనూ పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఎల్లారెడ్డిపేట మండలంలోని ఒక మిల్లరు 2021-22 సంవత్సరానికి 41 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 2023 మార్చిలోగా సీఎంఆర్‌కు ఇవ్వాలి. గడువు పూర్తయినా ఇంకా 1,450 క్వింటాళ్ల సీఎంఆర్ ఇవ్వలేదు. పౌరసరఫరాలశాఖ ఆ మిల్లుకు రూ.5.56 లక్షల పెనాల్టీ విధించింది.

ఇవీ సమస్యలు...

ప్రభుత్వం ధాన్యం కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా మిల్లింగ్ చేస్తున్నా మిల్లర్లు పలు సమస్యలతో సీఎంఆర్ ఇవ్వలేకపోతున్నారు.

■ ప్రభుత్వం మిల్లులకు అప్పగించిన ధాన్యాన్ని టెస్ట్ మిల్లింగ్ చేశాకే సేకరణ లక్ష్యం నిర్ణయించాలి. దొడ్డు రకం క్వింటాకు 67 కిలోల బియ్యం ఇవ్వాలి. మిల్లింగ్ అయ్యాక సగటున 62 కిలోలు మాత్రమే వస్తుంది.

■ పోర్టిఫైడ్ బియ్యం కోసం మిల్లుల్లో ఎఫ్ఆర్కే, సార్టెక్స్ యంత్రాలు అమర్చుకున్నారు. క్వింటాల్‌కు 3 యూనిట్లు ఖర్చయ్యేది సగటున 4.5 యూనిట్లకు పెరిగింది. దీంతో మిల్లు ఎల్‌టీ కేటగిరి నుంచి హెచ్‌టీలోకి మారుతుంది. దీంతో విద్యుత్తు బిల్లులు భారంగా మారాయి.

■ పాత గన్నీ సంచుల్లో బియ్యం నింపి గోదాంల్లో నిల్వ ఉంచుతున్నారు. ధాన్యం సంచులను శుభ్రం చేయకపోవడంతో అందులో కాప్రా పురుగులు పెరుగుతున్నాయి. దీంతో ఎఫ్‌సీఐ అధికారులు బియ్యం తీసుకోవడం లేదు.

■ మిల్లర్లు ధాన్యం మర ఆడించినందుకు క్వింటా బియ్యానికి రూ.10, బియ్యాన్ని గోదాంలకు తరలించే రవాణా ఛార్జీలను ప్రభుత్వం ఆరేళ్లుగా ఇవ్వడం లేదు.

■ గోదాంల్లో బియ్యం నిల్వ చేసినందుకు క్వింటాకు రూ.240, క్వింటా ధాన్యానికి కిలో తరుగును ప్రభుత్వం మిల్లర్లకు ఇవ్వాల్సి ఉన్నా అయిదేళ్లుగా చెల్లించడం లేదు.

మేమున్నాం.. మీకు తోడుగా...

(10 AM TO 1 PM)
వీర్నపల్లి: 91541 18151
బోయినపల్లి: 84999 90001

న్యూస్‌టుడే, గంభీరావుపేట

? గంభీరావుపేటలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఇళ్లలోకి చొరబడి సామగ్రిని చిందర వందర చేస్తున్నాయి. చర్యలు తీసుకోవాలి.
- అంబటి దేవరాజు

✔ గంభీరావుపేటలోనే కాకుండా చాలా చోట్ల ఈ సమస్య ఉంది. వాటిని శాశ్వతంగా వెళ్లగొట్టడానికి ప్రయత్నం చేయాలి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. **- రాజేశ్వర్, ఎంపీవో**

దుబాయిలో ఆకట్టుకున్న నేతన్న ఆవిష్కరణలు

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్ల చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ రూపొందించిన ఆవిష్కరణలు దుబాయిలో మెరిశాయి. దుబాయిలో ఎమిరేట్స్ పద్మశాలి అసోసియేషన్ మూడో వార్షికోత్సవం సందర్భంగా అసోసియేషన్ సభ్యులు గుత్తికొండ రవిచంద్ర, సరస్వతిలు హరిప్రసాద్ ప్రతిభను గుర్తించి దుబాయ్ ఆహ్వానించారు. అంతరించిపోయిన పట్టు పీతాంబరాలను 'రాజన్న సిరిపట్టు' చీరలతో పునసృష్టించిన హరిప్రసాద్ ఆ చీరలను దుబాయ్ వేదికగా ప్రదర్శించారు. అగ్గిపెట్టెలో ఇమిడే పట్టుచీర, దబ్బనంలో, ఉంగరంలో దూరే చీరలు, పట్టువస్త్రాలపై నూలు పోగులతో రూపొందించిన పలు చిత్రాలను ఈ సందర్భంగా ప్రదర్శించి అందరి మన్ననలు పొందారు.


హరిప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎమిరేట్స్ పద్మశాలి అసోసియేషన్ నాయకులు

స్వామివారి హుండీ లెక్కింపు

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్లలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. సోమవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని వేలం, టికెట్, హుండీ లెక్కింపు, ఇతర కానుకలు కలిపి రూ.7,19,513 వచ్చినట్లు తెలిపారు. ఆలయ ఈవో మారుతిరావు, అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వీర్నపల్లి మండలం బంజేరు గ్రామానికి చెందిన కన్నం జనార్దన్ ఇటీవల ఎస్జీటీ ఉద్యోగం సాధించగా నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, పోటీ పరీక్షలపై ప్రత్యేక దృష్టిసారించడం ద్వారా ప్రభుత్వ కొలువులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు ఈసంపల్లి కొమురయ్య, మానువాడ ప్రశాంత్, గజ్జెల ప్రశాంత్, సామ్యేలు, పీఈటీ జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చలో సిరిసిల్ల ఆత్మగౌరవ సభ విజయవంతానికి పిలుపు

ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 23న తలపెట్టిన చలో సిరిసిల్ల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కానపురం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సభకు సంబంధించిన గోడపత్రికలు, కరపత్రాలను ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లో సోమవారం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు మందకృష్ణమాదిగ హాజరవుతారని, మాదిగ, మాదిగ ఉపకులాలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, రాజయ్య, దేవయ్య, సురేశ్, రాజయ్య, శంకర్, చంద్రయ్య, రాజం, బాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వేలిముద్ర విధానం రద్దు చేయండి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. సోమవారం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కడారి రాములు మాట్లాడుతూ కార్మికులకు వేలిముద్ర విధానాన్ని రద్దు చేయాలని, గత రెండు నెలలుగా ఆగిపోయిన ఆన్‌లైన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కొత్త లేబర్ కార్డులను కార్మికులకు అందించడం కోసం ఆన్‌లైన్ ఓపెన్ అయ్యేలా చూడాలన్నారు. రెండు పడక గదుల ఇళ్లు ఇప్పించాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు గాజుల పోశెట్టి, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

సత్సంగ సదనంలోని గదికి తాళం

రాత్రి నుంచి ఉదయం వరకు ఆరుబయటే మహిళా భక్తురాలి జాగారం

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగ సదనంలో గదికి తాళం వేయడంతో ఓ భక్తురాలు ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు గది బయటే జాగారం చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సిరిసిల్లకు చెందిన శ్యామల అనే భక్తురాలు గత నాలుగేళ్లుగా సత్సంగ సదనంలో ఉంటుంది. ఆమెతోపాటు అక్కడ ఉండే కొంత మందికి వేర్వేరుగా గదులు కేటాయించారు. తన గదికి తాళం వేసి 15 రోజుల క్రితం తన కుమార్తె వద్దకు వెళ్లిన శ్యామల ఆదివారం సాయంత్రం తిరిగి వచ్చింది. ఆమె వేసిన తాళంపై మరో తాళం వేసి ఉండటాన్ని గమనించి అక్కడున్న వారిని అడిగినా స్పందన లేదు. దీంతో గదిబయట రాత్రి నుంచి ఉదయం వరకు ఉపవాస దీక్షలోనే జాగారం చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి విచారించారు. సత్సంగ సదనం అధ్యక్షుడు బ్రహ్మాచారి లక్ష్మారెడ్డి తాళాన్ని తొలగించి, ఆమెకు గదిని అప్పగించడంతో సమస్య సద్దుమణిగింది. అందులో ఉండే భక్తుల నడుమ విభేదాలతో గదికి తాళం వేసి ఉంటారని, స్థానికులు భావిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాకే ధాన్యం దించుకుంటాం

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమస్యలను ప్రభుత్వానికి విన్నవించామని, మా సమస్యలు పరిష్కరించాకే ధాన్యాన్ని దింపుకుంటామని జిల్లా పారాబాయిల్డ్ రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చేపూరి నాగరాజు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతిపత్రం అందించారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాని ద్వారా సమస్యలు పరిష్కారం అయిన తర్వాతే ధాన్యం దించుకొంటామని వెల్లడించారు. ధాన్యం పంపవద్దని డీఎస్‌వో, డీఎంలను ఆదేశించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చీటి నారాయణరావు, కోశాధికారి బుస్స శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. నేలవాలిన పంటలు

బోయినపల్లి, న్యూస్‌టుడే: గుండన్నపల్లి, స్తంభంపల్లి, కోరెం, అనంతపల్లి, దుంద్రపల్లి, బోయినపల్లి తదితర గ్రామాల్లో సోమవారం అకాల వర్షం కురిసింది. పలువురు రైతుల వ్యవసాయ పొలాల్లో పంటలు నేలవాలాయి.

కోనరావుపేట: కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఈదురుగాలులతో కూడిన వర్షంతో పలు చోట్ల వరిపంట నేలవాలింది.

ముస్తాబాద్: మండలంలో ఆదివారం అర్ధరాత్రి వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. త్వరగా కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

ప్రజలను రెచ్చగొట్టే మాటలు మానుకోవాలి

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: భారాస నాయకులు ప్రజలను రెచ్చగొట్టే మాటలు మానుకోవాలని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ పేర్కొన్నారు. సోమవారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో కనీసం రూ.లక్ష రుణమాఫీ చేయని వారు రుణమాఫీ గురించి మాట్లాడుతున్నారా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు భారాసకు లేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు వెలుముల స్వరూప, నాయకులు పాల్గొన్నారు.

భారీ కొండ చిలువ ప్రత్యక్షం

రాచర్ల బొప్పాపూర్ (ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ శివారులోని సర్వేయపల్లి ప్రాంతంలో ఉన్న ఓ వ్యవసాయ పొలంలో సోమవారం రాత్రి భారీ కొండ చిలువ ప్రత్యక్షమైంది. దీంతో అక్కడున్న రైతులు భయభ్రాంతులకు లోనై, పరుగు తీశారు. వరికోత యంత్రాన్ని దాని మీదుగా తీసుకెళ్లినా చనిపోక పోవడంతో గునపాన్ని కొండ చిలువ తలలో దింపారు. దీంతో ప్రాణాలు విడిచింది. సుమారు 3 మీటర్ల పొడవు, దాదాపు 20 కిలోల బరువు ఉంటుందని స్థానిక రైతులు తెలిపారు.



వ్యాసం రాసి.. విజేతగా నిలిచి





తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కల్లూరి సంజన ప్రథమ బహుమతి, దాసరి సాహితి ద్వితీయ బహుమతి, సీహెచ్. మహేశ్ తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజ్‌కుమార్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

-న్యూస్‌టుడే, సిరిసిల్ల (విద్యానగర్)

నిధులున్నా నిర్లక్ష్యమే!

కల్వర్టు నిర్మాణంలో తీవ్ర జాప్యం

న్యూస్‌టుడే, సిరిసిల్ల (విద్యానగర్)

సిరిసిల్లలోని సుభాష్‌నగర్‌లో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమలు, దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. సుభాష్‌నగర్‌లో 18వ వార్డు నుంచి 5వ వార్డు మీదుగా సాగే కాలువ కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. పూర్తిగా కూలిపోవడంతో మురుగు సాగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువ కల్వర్టు కూలిపోవడంతో పూడిక నిండి మురుగు సాఫీగా సాగడం లేదు.

పురపాలక సంఘం కల్వర్టు నిర్మాణానికి జూన్‌లో రూ.14 లక్షలు మంజూరు చేసింది. నాలుగు నెలలు గడుస్తున్నా ఇంతవరకు పనులు చేపట్టలేదు. కనీసం మరమ్మతులు చేయలేదు. దీంతో మురుగు సాఫీగా సాగక, కాలువ చుట్టూ పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు, పాదచారులు రాకపోకలకు పాట్లు తప్పడం లేదు.


శిథిలావస్థకు చేరుకున్న కల్వర్టు

- చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపైకి మురుగంతా చేరుకొని స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై, లోతట్టు ప్రాంతాలకు, ఇళ్లలోకి మురుగు చేరుతోంది. దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు.
- పట్టణంలోని 18వ వార్డు నుంచి ప్రారంభమయ్యే కాలువ నెహ్రూనగర్, సుభాష్‌నగర్, గాంధీనగర్, అంబేడ్కర్‌నగర్, శాంతినగర్ వరకు ప్రవహిస్తుంది. కాలువ కల్వర్టు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో సమస్య ఏర్పడింది.

సమస్యలు పరిష్కరించాలి



నెహ్రూనగర్ నుంచి సుభాష్ నగర్ మీదుగా ప్రవహించే కాలువ పూడికతో నిండి మురుగు సాగడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా మురుగంతా ఇళ్లలోకి చేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దోమల బెడద అధికంగా ఉంది. వార్డులోని కాలువలను శుభ్రం చేయడం లేదు. **- గోదావరి, స్థానికురాలు**

పనులు ప్రారంభిస్తాం

సిరిసిల్లలోని 18వ వార్డు నుంచి 5వ వార్డు మీదుగా సాగే కాలువ కల్వర్టు శిథిలావస్థకు గురై స్థానికులు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే. జూన్‌లో రూ.14 లక్షలు మంజూరయ్యాయి. టెండర్ పిలిచినప్పటికీ పనులు కొంత ఆలస్యమయ్యాయి. రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తాం. దోమల బెడదను నివారించేందుకు ఫాగింగ్ చేయిస్తున్నాం. ఇతర పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం.
- దార్నం అరుణ, స్థానిక కౌన్సిలర్



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలి

వీర్నపల్లి, న్యూస్‌టుడే: పోలీసులు ప్రజలతో సత్సంబంధాలను కొనసాగించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా వీర్నపల్లి పోలీస్ స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. ఠాణా పరిసరాలు, స్టేషన్ రికార్డులు, వర్టికల్స్ అమలు తీరు, స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది కిట్ ఆర్టికల్స్, పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన ఫైళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణ కోసం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని, వీపీవోలు తమకు కేటాయించిన గ్రామాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్, ఎస్సై ఎల్లాగౌడ్, సిబ్బంది ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బోయినపల్లి, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. తడగొండ, అనంతపల్లి, బోయినపల్లి, కొదురుపాక, జగ్గారావుపల్లి, మాన్వాడ, మల్లాపూర్, నర్సింగాపూర్, విలాసాగర్, మర్లపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్‌లు వెంకటరామారావు, సురేందర్ రెడ్డి, దుర్గారెడ్డి, కిషన్ రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ ఎల్లేశ్ యాదవ్, సెస్ డైరెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

సిరిసిల్ల గ్రామీణం, తంగళ్లపల్లి: సిరిసిల్ల పట్టణ పరిధిలోని పెద్దూరు, తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిరిసిల్ల మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు వెలుముల స్వరూప ప్రారంభించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళ, పీఏసీఎస్ అధ్యక్షులు భాస్కర్‌గౌడ్, కిషన్, కౌన్సిలర్లు కీర్తి, కమలాకర్‌రావు, లింగంపల్లి సత్యనారాయణ, భారాస, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


పెద్దూరులో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిరిసిల్ల మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు స్వరూప, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కళ, నాయకులు


తెర్లుమద్దిలో ప్రారంభిస్తున్న ఏఎంసీ ఛైర్‌పర్సన్ రాణి తదితరులు

ఎల్లారెడ్డిపేట: బాకురుపల్లితండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ ఛైర్‌పర్సన్ సాబేరాబేగం సోమవారం ప్రారంభించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఐకేపీ ఏపీఎం మల్లేశం, ఏఎంసీ వైస్ ఛైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని నాగంపేట, రాజేశ్వర్‌రావునగర్, మల్లుపల్లి గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ ఛైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయ ప్రారంభించారు.

ముస్తాబాద్: మండలంలోని తెర్లుమద్ది, సేవాలాల్‌తండా, గన్నెవారిపల్లె, తుర్కపల్లె, రామలక్ష్మణపల్లె, కొండాపూర్, మద్దికుంట గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ ఛైర్‌పర్సన్ తలారి రాణి ప్రారంభించారు. అనంతరం ఏఎంసీ ఛైర్‌పర్సన్‌తోపాటు డైరెక్టర్లను శాలువాతో ఘనంగా సన్మానించారు.

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ తాజా మాజీ సర్పంచుల జేఏసీ నాయకులు సోమవారం కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. మాజీ సర్పంచులకు బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు. వీరికి భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, భాజపా నాయకులు, సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, నాయకులు మద్దతు తెలిపారు. మాజీ సర్పంచులు, భాజపా, సీపీఐ, సీపీఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అన్యమతస్థులతో ప్రసాదం విక్రయంపై ఫిర్యాదు

సిరిసిల్ల కలెక్టరేట్, విద్యానగర్, న్యూస్‌టుడే: సిరిసిల్లలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర దేవాలయంలో అన్యమతస్థులతో ప్రసాదం విక్రయించి ధార్మికత్వానికి విఘాతం కలిగించారని, అధికారుల ప్రమేయంతో హిందుత్వంపై కుట్ర జరిపిన వారిపై చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చేపూరి అశోక్ కోరారు. సోమవారం విశ్వహిందూ పరిషత్ సభ్యులు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు ఫిర్యాదు చేశారు. కాగా లడ్డూ తయారీలో అన్యమతస్థుల ప్రమేయం లేదని ఆలయ అధ్యక్షుడు ఉప్పల విఠల్‌రెడ్డి తెలిపారు. లడ్డూ టెండర్‌ను హిందువు అయిన పులి మల్లేశంకు అప్పగించామని పేర్కొన్నారు.

పిడుగుపడి రైతుకు అస్వస్థత

బోయినపల్లి, న్యూస్‌టుడే: పిడుగు పడటంతో రైతు అస్వస్థతకు గురైన సంఘటన బోయినపల్లి మండలం అనంతపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన జనార్దన్ కౌలుకు తీసుకొని పత్తి సాగు చేస్తున్నాడు. పత్తి ఏరుతుండటంతో పొలం వద్దకు వెళ్లాడు. అకాల వర్షం కురవడంతో పక్కనే ఉన్న షెడ్డు లోపలికి వెళ్లాడు. షెడ్డు పక్కనే ఉన్న చెట్టుపై పిడుగు పడటంతో అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే ఇంటికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు ప్రథమ చికిత్స చేయించారు.

ఆధునిక హంగులతో మార్కెట్ యార్డు నిర్మాణం

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆధునిక హంగులతో నూతన మార్కెట్ యార్డు నిర్మిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం వేములవాడ గ్రామీణ మండలం మర్రిపల్లిలో మార్కెట్ యార్డు నిర్మాణానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దారు సుజాత, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


సర్దాపూర్‌లోని పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కమాండెంట్ శ్రీనివాస్‌రావు, సిబ్బంది

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని 17వ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. సోమవారం పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఉదయ్ భాస్కర్, ఏవో ప్రమీల, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ ఠాణాలో ఎస్సై గణేశ్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరులకు పోలీసు సిబ్బంది సోమవారం ఘనంగా నివాళులర్పించారు.

గర్జనపల్లి(వీర్నపల్లి): వీర్నపల్లి మండలం గర్జనపల్లి ఉన్నత పాఠశాలలో పోలీసు అమరవీరులకు విద్యార్థులు సోమవారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు కులేరి ప్రేమ్‌సాగర్, ఉపాధ్యాయులు ఉమారాణి, బలరాంనాయక్, మంజుల, కవిత పాల్గొన్నారు.

కళాశాలలో సమస్యల పరిష్కారానికి కృషి

రుద్రంగి, న్యూస్‌టుడే: రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా దృష్టిసారిస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం ఆయన ప్రత్యేకంగా సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలకు సమీపంలో రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు అయ్యేలా చూడాలని వేములవాడ, కోరుట్ల ఆర్టీసీ డిపో మేనేజర్లకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు గంగనర్సయ్య, మోహన్‌రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

దళితులకు ఇళ్లు కేటాయించాలని ఆందోళన

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లో రెండు పడక గదుల ఇళ్లను దళితులకే కేటాయించాలని సిరిసిల్ల మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నేదూరి లక్ష్మణ్ కోరారు. సోమవారం రెండు పడక గదుల ఇళ్లను దళితులకే కేటాయించాలని కోరుతూ మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణానికి చెందిన దళితులకు ఇళ్ల స్థలాల కోసం 50 సంవత్సరాల క్రితం ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి నిరుపేదలకు పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. అప్పుడు అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణంతోపాటు మౌలిక వసతులు ఏర్పాటు చేయకపోవడం వల్ల వాటిలో నివసించలేకపోయామని తెలిపారు. ఆ స్థలంలో నర్సింగ్ కళాశాల, అంబేడ్కర్ భవనం నిర్మాణంతోపాటు రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి ఇస్తామని అప్పటి మంత్రి కేటీఆర్ మాట ఇవ్వడంతో అంగీకరించినట్లు తెలిపారు. ఆ ఇళ్లను దళితులకే ఇవ్వాలని కోరారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం గౌరవ సలహాదారులు కత్తెర దేవదాస్, ఆకునూరి బాలరాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాయకులు సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ స్వరూప, ఎల్లె లక్ష్మీనారాయణ, నక్క నర్సయ్య, కొట్టెపల్లి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళితులు

గాలిపెల్లిలో యువకుడి ఆత్మహత్య

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: ఇల్లంతకుంట మండలంలోని గాలిపెల్లి గ్రామానికి చెందిన కండోజి వంశీ (20) అనే యువకుడు సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. వంశీ ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటున్నాడని పేర్కొన్నారు. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లేందుకు తెలిసిన వారిని డబ్బులు అడగగా, ఎక్కడా అప్పు దొరకకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి తల్లి రేవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

నేర వార్తలు

భార్యను వేధించిన భర్తకు జైలు, జరిమానా

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ సిరిసిల్ల కోర్టు జడ్జి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ముస్తాబాద్ ఎస్సై గణేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం తుల్జాపూర్ గ్రామానికి చెందిన సుంకరి రాజుకు ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన మేఘమాలతో 2010 సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కొన్నేళ్ల తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధింపులకు గురిచేయడంతో 2015లో ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో భర్త రాజుపై ఫిర్యాదు చేయగా అరెస్టు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాదిన్నర జైలు శిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఎస్సై తెలిపారు.

మల్లాపూర్ ఎల్లమ్మ ఆలయంలో చోరీ

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండలం మల్లాపూర్ ఎల్లమ్మ ఆలయంలో సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారి మెడలో ఉన్న పుస్తె, మట్టెలు ఎత్తుకెళ్లారు. దీనిపై ఆలయ అర్చకుడు బాస శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

యువకుడి అదృశ్యం

గంభీరావుపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని దోశలగూడెం కాలనీకి చెందిన బరిగెల బాబు(25) ఈ నెల 19న రాత్రి ఇంట్లో తల్లిదండ్రులకు మళ్లీ వస్తానని చెప్పి వెళ్లాడు. తిరిగి రాలేదు. రెండు రోజులు గాలించారు. ఆచూకీ లభించలేదు. తన సోదరుడు బరిగెల సోమేశ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడికి గాయాలు

బోయినపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడికి గాయాలైన సంఘటన తడగొండ గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాలకు చెందిన సాయికృష్ణారెడ్డి ద్విచక్రవాహనంపై గంగాధర వైపు వెళ్తున్నాడు. తడగొండ శివారులోకి చేరుకోగానే అదుపు తప్పి కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి కోసం ఆరా

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలోని మటన్ మార్కెట్ ప్రాంతంలో రెండు రోజుల క్రితం ఓ ఇంట్లో జరిగిన చోరీ సంఘటనపై పట్టణ పోలీసులు ఆరా తీస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి బంగారు ఆభరణాలను అపహరించాడు. దాదాపు 30 నుంచి 40 ఏళ్ల వయసున్న వ్యక్తి పాక్షికంగా దివ్యాంగుడిగా నడుస్తున్నట్లు సీసీ కెమెరాలో గుర్తించిన పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తి వివరాలు తెలిపిన వారికి రూ. 5 వేల నగదు బహుమతిని ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రకటించారని పట్టణ సీఐ వీర ప్రసాద్ తెలిపారు.